## క్లుప్తంగా

### రహదారుల అభివృద్ధికి పెద్దపీట


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**ఝరాసంగం(జహీరాబాద్):** రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని బర్దీపూర్, కుప్పానగర్, గుంతమర్పల్లి గ్రామాల్లో రూ.60లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ఉమాకాంత్‌పాటిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచయ్యస్వామి, ప్రజాప్రతినిధులు జగదీశ్వర్, శివలక్ష్మి కృష్ణ, విజేందర్‌రెడ్డి, లక్ష్మిబాయి పాల్గొన్నారు.

### లండన్ పర్యటనలో 'ఖేడ్' ఎమ్మెల్యే


ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలుకుతున్న ప్రవాసాంధ్రులు

**నారాయణఖేడ్:** ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి జయశ్రీరెడ్డి దంపతులు గురువారం వ్యక్తిగత పర్యటనలో భాగంగా లండన్ వెళ్లారు. ఈ సందర్భంగా లండన్‌లోని హీత్రూ విమానాశ్రయంలో వారికి ప్రవాసాంధ్రులు దొరోళ్ల విష్ణువర్ధన్‌రెడ్డి, అనసూరి శ్యాంప్రసాద్, బుర్రా మురళీదేవరశెట్టి శంకర్ తదితరులు పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వారితో కలిసి ఎమ్మెల్యే దంపతులు విందుభోజనం చేశారు.

### వనభోజనాలకు అనుమతి ఇవ్వాలి

**సంగారెడ్డి మున్సిపాలిటీ:** ఆషాడమాసం సందర్భంగా పట్టణంలోని అస్తబల్తోటలో వనభోజనాలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఎఫ్ఆర్ఎస్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ సుచిత్రకు జనజాగృతి సేన అధ్యక్షుడు బంగారు కృష్ణ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆషాడమాసం సందర్భంగా అస్తబల్ తోటలో వనభోజనాలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కానీ.. చెట్లు పాడవుతున్నాయనే కారణంతో ప్రభుత్వం 3ఏళ్ల నుంచి వనభోజనాలకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. దీంతో భక్తులు దర్శనం చేసుకుని నిరాశగా వెళ్తున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వనభోజనాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వేణుగోపాల్, మహేష్, రాజేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### గీతకార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న అంజాగౌడ్

**నారాయణఖేడ్:** గీతకార్మికుల సమస్యలు పరిష్కరించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్ డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లో గురువారం నిర్వహించిన డివిజన్ స్థాయి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్కో సొసైటీకి ఈత, తాటి చెట్ల పెంపకానికి ఐదెకరాల భూమి, రూ.30లక్షల సబ్సిడీ రుణాలు, రూ.5వేల పింఛన్, గీత కార్మికులందరికీ ద్విచక్రవాహనాలు, స్టేఫీ మోకులు ఇవ్వాలన్నారు. ఇటీవల గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గీతాకార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10న సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం డివిజన్ బాధ్యులు నర్సింహ్మాగౌడ్, శంకర్‌గౌడ్, భూమాగౌడ్ పాల్గొన్నారు.

### డీజేఎఫ్ యూనియన్ ఏర్పాటు

**జహీరాబాద్:** నియోజకవర్గ దళిత జర్నలిస్టు ఫోరం యూనియన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన సమావేశంలో కన్వీనర్‌గా పురుషోత్తంరావు, కో–కన్వీనర్లుగా నవీన్‌కుమార్, జగన్ ఎన్నుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. దళిత జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఫోరం ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

# జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

జిల్లా వ్యాప్తంగా డాక్టర్ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులు జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు.


జహీరాబాద్: జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, నాయకులు


సంగారెడ్డి మున్సిపాలిటీ: నివాళ్లు అర్పిస్తున్న చింతా ప్రభాకర్, నాయకులు


వట్‌పల్లి: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


జిన్నారం: బొల్లారంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


రామచంద్రాపురం: నివాళులర్పిస్తున్న బెల్ అధికారులు, కార్మికులు

# మారుతున్న గ్రామాల రూపురేఖలు

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**జిన్నారం(పటాన్‌చెరు):** సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా మారుమూల గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం గుమ్మడిదల మండలంలోని గుమ్మడిదల, నాగిరెడ్డిగూడెం గ్రామాల్లో రూ. 3.15 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులకు 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న యంత్రాలు, వ్యవసాయ పనిముట్లను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 55 జీపీలను అత్యుత్తమ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని..


రైతులకు సబ్సిడీ యంత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

గత ప్రభుత్వాల హయాంలో మారుమూల గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ మంజుల, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి

**పటాన్‌చెరు టౌన్:** శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారతదేశ కీర్తిప్రతిష్టలను ఎలుగెత్తి చాటిన దేశభక్తుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. కార్యక్రమంలో పటాన్‌చెరు బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సాయికుమార్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జోగు ధన్‌రాజ్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి దీపక్‌గౌడ్, ఎస్ఆర్‌కే యువసేన నాయకులు షఫీ, షకిల్, రాము, కుమార్ పాల్గొన్నారు.

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** విద్యావేత్త డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని గురువారం


శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న శ్రీకాంత్‌గౌడ్

రామచంద్రాపురంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బంజారా భవన్ పనులు ప్రారంభం

**జహీరాబాద్ టౌన్:** పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలో చేపట్టనున్న బంజారా భవన్ నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. జహీరాబాద్ ప్రాంతంలోని గిరిజనుల కోరిక మేరకు ప్రభుత్వం బంజారా భవన్‌కు స్థలం కేటాయించి రూ.50 లక్షలు మంజూరు చేసింది. దీంతో నిధులు మంజూరు కావడంతో మున్సిపల్ డీఈ దీప్‌చంద్ నిర్మాణం పనులకు మార్కింగ్ వేశారు. పనులు ప్రారంభించడంతో గిరిజన నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థలంతో పాటు నిధుల మంజూరుకి కృషి చేసిన మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాణిక్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి తులసీరాం రాథోడ్, నాయకులు శ్రీనివాస్, రమేశ్ బానోత్, రాంసింగ్, మల్‌చెల్మ సర్పంచ్ చందర్‌పవార్ పాల్గొన్నారు.


బంజారా భవన్‌కు మార్కింగ్ వేస్తున్న అధికారులు

# బీసీలను నిర్లక్ష్యం చేస్తే సహించం

**సదాశివపేట (సంగారెడ్డి):** డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపుల్లో బీసీలను నిర్లక్ష్యం చేస్తే సహించబోమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకపల్లి ప్రకాష్ అన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బీసీలకు బీసీలకు చట్టసభల్లో 52శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు ఎన్నికల్లో జనాభా ప్రతిపాదికన ఎమ్మెల్యేల సీట్లు ఇచ్చే పార్టీకే ఓట్లు వేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ జాయింట్ కన్వీనర్ ఈశ్వర్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రాములుయాదవ్, పట్టణ అధ్యక్షుడు అంతయ్య, జ్యోతిరావు పూలే, జిల్లా అధ్యక్షుడు జావిద్ పాల్గొన్నారు.

# ఒకరికి పదేళ్ల జైలు

**సంగారెడ్డి టౌన్:** భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సంగారెడ్డి సివిల్ కోర్టు జడ్జి రాధాకృష్ణ చౌహాన్ గురువారం తీర్పునిచ్చారని పోలీసులు తెలిపారు. సదాశివపేటకు చెందిన సంధ్యారాణి (టీచర్)ని రేగోడ్ మండలం దన్వర్ గ్రామానికి చెందిన పత్రి కిషన్ (టీచర్)తో వివాహమైంది. వీరికి ఇద్దరు బాలికలు సంతానం. బాలికలు జన్మించాడని తరుచుగా భార్యాభర్తలు గొడవపడేవారు. ఈ క్రమంలో 2016 ఆగస్టు 17న సాయంత్రం 6.30 గంటలకు వారి ఇంట్లో ఉరివేసుకొని చనిపోయింది. కూతురి ఆత్మహత్యకు అల్లుడి వేధింపులే కారణమని కొండాపూర్ పోలీస్ స్టేషన్లో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈరోజు కేసు విచారణకు రాగా సంగారెడ్డి సివిల్ కోర్టు జడ్జి రాధాకృష్ణ చౌహాన్.. నిందితుడికి 10 ఏళ్ల జైలుశిక్ష, 11 వేల జరిమానా, గృహహింస కింద మూడేళ్ల జైలు శిక్ష విధించారు. జరి మానా చెల్లించడంలో విఫలమైతే నెల సాధా రణజైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పునిచ్చారని పోలీసులు తెలిపారు.

### రేషన్‌డీలర్‌ను తొలగించాలి

**కల్హేర్(నారాయణఖేడ్):** మండల పరిధిలోని మహదేవుపల్లి గ్రామ రేషన్‌డీలర్‌ను తొలగించాలని డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ ఉమర్ పాషాకు గురువారం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ నాగధర పాపయ్య ఇటీవల అనుమానస్పదంగా మృతి చెందిన విషయం విదితమే. సర్పంచ్ పాపయ్యను రేషన్‌డీలర్ నీరుడి సంతోష్ కుటుంబీకులే హత్య చేశారని పాపయ్య కుటుంబీకులు, గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో డీలర్ సంతోష్‌ను తొలగించాలని గ్రామ పంచాయతీలో తీర్మానం చేశారు. ఈ మేరకు తీర్మాన ప్రతులను జతచేసి డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు.

### మురుగునీరు తొలగింపు


రోడ్డుపై నిలిచిన నీరును తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

**నారాయణఖేడ్:** పట్టణంలోని ఏఎస్‌నగర్ కాలనీలో మురుగు కాలువను రోడ్డు కంటే ఎత్తుగా నిర్మించారు. దీంతో వర్షపు నీరు వెళ్లడానికి మురుగుకాల్వలకు అక్కడక్కడా కొంత దారి ఖాళీగా ఉంచినా అవి పూర్తిగా పూడుకుపోవడంతో వర్షపునీరు రోడ్డుపై నిలుస్తూ రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో మున్సిపాలిటీ సిబ్బంది గురువారం మున్సిపాలిటీ కార్మికులు మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి నీరు నిలువకుండా చర్యలు చేపట్టారు.

# కనీస వేతనాలను అమలు చేయాలి


జహీరాబాద్: మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

**జహీరాబాద్ టౌన్:** కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ కోరారు. ఎంప్లాయిమెంట్ జీవోలు అమలు చేయాలని చేపట్టిన జీపుజాతా గురువారం పట్టణంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా మహీంద్ర కర్మాగారం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడుదారుల పక్షాన ఉండి కార్మికులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. కనీస వేతన సవరణ చేయకపోవడం శోచనీయన్నారు. సంఘం అధ్యక్షుడు మల్లేశం, రాష్ట్ర నాయకుడు మల్లికార్జున్, కార్యదర్శులు మహిపాల్, రాజిరెడ్డి, నాయకులు నర్సయ్య, నారాయణ పాల్గొన్నారు.

**సదాశివపేట రూరల్ (సంగారెడ్డి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులు ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, మల్లికార్జున్ అన్నారు. జీపుజాతా గురువారం మండల పరిధిలోని ఎంఆర్ఎఫ్ పరిశ్రమ వద్దకు చేరుకుంది. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, నాయకులు నీల మల్లేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**పటాన్‌చెరు టౌన్:** గ్రామపంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న గ్రామ పంచాయతీ, పారిశుధ్య కార్మికులు, స్వీపర్లు, పంపు ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్‌లు, డ్రైవర్లకు కనీస వేతనాలను అందజేయాలని తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, నాయకులు షబ్బీర్, సుదర్శన్, యాదయ్య, పోచయ్య, రాములు పాల్గొన్నారు.

**ఝరాసంగం(జహీరాబాద్):** గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిరవధిక సమ్మె చేపట్టారు. సీఐటీయూ మండల కార్యదర్శి చంద్రన్న, కార్మికులు పాల్గొన్నారు.

**సదాశివపేట సంగారెడ్డి):** పెరిగిన ధరలకు అనుగుణంగా గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు దశరథ్,నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ గాలి అనిల్‌కుమార్‌ను కలిసిన నాయకులు**

**హత్నూర (సంగారెడ్డి):** కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్‌ను ఇటీవల నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా నియమితులైన సుజాతసత్యం, కాంగ్రెస్ మండల నాయకులు, సర్పంచులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**◆ ముగిసిన సప్తాహభజన**

**న్యాల్‌కల్(జహీరాబాద్):** స్థానిక రామలింగేశ్వర ఆలయంలో వారం రోజులుగా నిర్వహించిన సప్తాహభజన కార్యక్రమాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

**◆ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి**

**పటాన్‌చెరు టౌన్:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఐనోల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పార్కర్ హనీ ఫిన్ ఇండియా వారి సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు గురువారం ఎడ్యుకేషన్ కిడ్స్, కంప్యూటర్, వాలీబాల్, ప్రింటర్, షటిల్, క్యారంబోర్డ్, లంచ్ ప్లేట్స్ స్కిప్పింగ్ రూప్ తదితర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, పంచయతీ కార్యదర్శి మౌనికరెడ్డి, చెల్డ్ లైన్ కోఆర్డినేటర్ మహాజీబ్, కోఆర్డినేటర్ స్వప్న, మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ హఫీజ్, నవీన్ పాల్గొన్నారు.

**◆ ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన**

**జిన్నారం(పటాన్‌చెరు):** మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామంలోని పోచమ్మ దేవాలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రకాశ్‌చారి మాట్లాడుతూ వచ్చే ఆదివారం నిర్వహించనున్న పోచమ్మ బోనాలకు భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈఓ నరేష్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**◆ స్కూల్ బ్యాగులు పంపిణీ**

**పటాన్‌చెరు టౌన్:** పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం ఎండీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మధు, కో–ఫౌండర్ పృథ్వీరాజ్ కలిసి విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పేద విద్యార్థులకు సాయం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

**◆ పాస్టర్ తీరుపై నిరసన**

**జిన్నారం(పటాన్‌చెరు):** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఓ పాస్టర్ తీరుపై స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆయన తీరులో మార్పు రాలేదన్నారు. వారం రోజుల క్రితం ప్రగతినగర్‌లో ఓ యువతితో పాస్టర్ చనువుగా ఉన్న సమయంలో ఆయన భార్య పట్టుకొని, ఆ యువతిని పరుగెత్తించుకుంటూ కొట్టిన వీడియోలు వైరల్ అయ్యాయి. పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**◆ కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం**

**జిన్నారం(పటాన్‌చెరు):** మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యమని బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా గురువారం బొల్లారంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు జైపాల్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ మున్సిపల్ బాధ్యతలు అప్పగించటం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**◆ కాలువలు కబ్జా చేస్తే కఠిన చర్యలు**

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** వరద కాలువలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇరిగేషన్ ఏఈ సంతోషిని హెచ్చరించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ పెద్ద చెరువు వరద కాలువకు గురువారం జేసీబీతో మరమ్మతులు చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెరువులు, కాలువల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**◆ మోతిమాతను దర్శించుకున్న ఎర్రోళ శ్రీనివాస్**

**జహీరాబాద్ టౌన్:** మొగుడంపల్లి మండలంలోని ఉప్పరపల్లి తండాలో గిరిజనుల ఆరాధ్య దైవం మోతిమాతను టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ శ్రీనివాస్ గురువారం దర్శించుకున్నారు. ఆయనతో బీఆర్ఎస్ నాయకులు విజయమోహన్‌రెడ్డి, కిషన్ పవార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఉన్నారు.

**◆ మొక్కలను పరిరక్షించాలి**

**జహీరాబాద్ టౌన్:** మొక్కలను నాటి పరిరక్షించాలని ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తట్టు నారాయణ అన్నారు. హరితహారంలో భాగంగా మండలంలోని అనేగుంటలో గురువారం గ్రామస్తులకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**◆ నోట్‌పుస్తకాలు పంపిణీ**

**సదాశివపేట(సంగారెడ్డి):** పట్టణ పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సమతా(బెట్టి) సంస్థ ఆధ్వర్యంలో గురువారం నోటుపుస్తకాలతో పాటు ఇతర సామాగ్రిని ఎంఈఓ దండు అంజయ్య ఆధ్వర్యంలో అందజేశారు. గ్రామానికి చెందిన విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనంతయ్య వారి కుటుంబ సభ్యులు విద్యార్థులకు నోటుపుస్తకాలు ఇతర సామాగ్రి అందజేయడం అభినందనీయమని ఎంఈఓ అన్నారు.

**◆ పాఠశాలల్లో తనిఖీలు**

**కల్హేర్(నారాయణఖేడ్):** మండలంలోని మాసాన్‌పల్లిలో ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలను ఎంఈఓ శంకర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు.

**◆ టీకాలు వేయించాలి**

**న్యాల్‌కల్(జహీరాబాద్):** పశువులు, జీవాలను వ్యాధులు రాకుండా టీకాలను వేయించాలని న్యాల్‌కల్ పశువైద్యాధికారి అజింక్యా అన్నారు. గురువారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటించి టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఘనీ తదితరులు పాల్గొన్నారు.

**◆ డీడీఎస్ సంఘం దుకాణం ప్రారంభం**

**న్యాల్‌కల్(జహీరాబాద్):** మండల పరిధిలోని గంగ్వార్ చౌరస్తా వద్ద డీడీఎస్ సంఘం దుకాణం (చిరుధాన్యాలు)ను గురువారం శాస్త్రవేత్త లక్ష్మణ్, ఎంపీపీ అధ్యక్షురాలు అంజమ్మతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**రాయికోడ్(అందోల్):** మండలంలోని చిమ్నాపూర్ గ్రామంలో పస్తాపూర్ డీడీఎస్ ఆధ్వర్యంలో డీడీఎస్ సంఘం దుకాణాన్ని ప్రారంభించారు.

**◆ కాంగ్రెస్ మండలాల అధ్యక్షుల నియామకం**

**నారాయణఖేడ్:** నియోజకవర్గంలోని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమిస్తూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లురవి ఉత్తర్వులు జారీ చేశారు. ఖేడ్ మండల అధ్యక్షులుగా వాహెద్ తాహెర్, ఖేడ్ పట్టణ అధ్యక్షులుగా దారం శంకర్‌ను నియమించారు. మనూరు మండల అధ్యక్షులుగా సుభాష్‌రావు, నాగల్‌గిద్దకు మాణిక్‌రావుపాటిల్, కంగ్టికి మల్లారెడ్డి, సిర్గాపూర్‌కు మనీష్ పాటిల్, కల్హేర్‌కు బూర్గుల పోచయ్య, నిజాంపేట్‌కు శంకర్‌గౌడ్, పెద్దశంకరంపేట మండలానికి రాయిని మధుసూదన్ నియమితులయ్యారు.

**మనూరు(నారాయణఖేడ్):** మనూరు, నాగల్‌గిద్ద మండలాల కాంగ్రెస్ అధ్యక్షులుగా రాణాపూర్ గ్రామానికి చెందిన సుభాష్‌రావుపాటిల్, నాగల్‌గిద్ద మండలంలోని ముక్టాపూర్ గ్రామానికి చెందిన మాణిక్‌రావు పాటిల్‌లు నియమితులయ్యారు.

**◆ సిద్ధివినాయక ఆలయంలో భక్తుల సందడి**

**న్యాల్‌కల్(జహీరాబాద్):** సంకష్టహార చతుర్థి సందర్భంగా మండల పరిధిలోని రేజింతల్, హద్నూర్ గ్రామ శివారులో వెలసిన సిద్ధివినాయక ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

**◆ ఘనంగా సంకష్టహర చతుర్థి**

**నారాయణఖేడ్:** పట్టణంలోని రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం గురువారం సంకష్టహర చతుర్థిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధి, సిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు చిన్ని మధుకర్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

**◆ సాయిబాబా ఆలయంలో పూజలు**

**సదాశివపేట రూరల్(సంగారెడ్డి):** మండల పరిధిలోని ఇశ్రితాబాద్ శివారులోని సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోదూరి రాములు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.